క్లుప్తంగా

జ్యోతిషం మానవుడికి దిక్సూచి



కమిషనర్‌కు ప్రసాదం అందజేస్తున్న వేదవిజ్ఞాన ప్రతిష్టానం కార్యదర్శి ప్రసాదశర్మ

బోట్‌క్లబ్: జ్యోతిషం మానవుడికి దిక్సూచి వంటిదని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు అన్నారు. జ్యోతిష్య విజ్ఞాన ప్రతిష్టానం ఆధ్వర్యంలో స్థానిక రామారావు పేట ప్రతిష్టాన కార్యాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా విశేష హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిష్టాన కార్యదర్శి రాయప్రోలు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో కమిషనర్ జె వెంకటరావును ఘనంగా సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ అందరూ సుఖసంతోషాలతో జీవనం కొనసాగించాలన్న ప్రధాన ఆశయంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ద్రాక్షరామ శర్మ, దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు.

రేపు డీవైఈఓ పోస్టులకు రాత పరీక్ష

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ ద్వారా ఏపీ ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కాకినాడ జిల్లాలో మూడు సెంటర్లలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్ గురువారం తెలిపారు. కాకినాడ జిల్లాలోని సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ, ప్రగతి ఇంజినీరింగ్ కాలేజీ, కాకినాడ అచ్యుతాపురంలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఐడిజెడ్‌లలో జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 7.30 గంటల నుంచి 8.40 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని డీఆర్వో కోరారు.

ఘనంగా వ్యాస పూజ

బోట్‌క్లబ్: స్థానిక జర్నలిస్ట్ కాలనీలోని రమా సహిత సత్యదేవ, దాసాంజనేయ స్వామి మందిర ప్రాంగణంలో గురువారం వ్యాస పూజ నిర్వహించారు. మధ్వ పురోహితుడు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. తొలుత వ్యాసపూజ సందర్భంగా గురువుల నామ పఠనం చేశారు. అనంతరం పౌర్ణమి సందర్భంగా రమా సహిత సత్యదేవ స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. మధ్వేష్ మాట్లాడుతూ గురు స్మరణ ద్వారా మనకి అన్ని శుభాలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు సత్యనారాయణ స్వామి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరశురామ్, తుంగమణి, అమూల్య రుక్మిణి, మౌనిక, రఘోత్తమ, రామా మణి, దీక్షిత పాల్గొన్నారు.

అన్నమయ్య జయంతి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అన్నయ్య జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్యుల చిత్రపటానికి ఆధ్యాత్మికవేత్త రవి శంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు తదితరులు నివాళులర్పించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

ఘనంగా చండీహోమం

పెద్దాపురం: బుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక మరిడమ్మ తల్లి ఆలయంలో గురువారం చండీహోమం నిర్వహించారు. ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనారావు ఆధ్వర్యంలో వేద పండితులు ఐవీ ప్రసాద్ శర్మ, ఎన్‌వీ శాస్త్రి, ఏవీ భానుమూర్తి మంత్రోచ్ఛారణల మధ్య హోమాన్ని నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మినీ ఫంక్షన్ల కోసం ఏర్పాటుచేసిన డార్మెటరీ



ఆహ్లాదకర వాతావరణానికి అనువుగా బాట... పక్కన మొక్కలు



శిల్పారామంలో చిన్నారుల ఆట విడుపు

ఆట విడుపు.. ఆహ్లాదం

- సందర్శకులను ఆకట్టుకుంటున్న శిల్పారామం
- త్వరలో అందుబాటులోకి వాటర్ పార్కు



కాకినాడ బీచ్‌లో కళాత్మకంగా శిల్పారామం ప్రవేశ ద్వారం

కాకినాడ రూరల్: వేసవి వచ్చిందంటే చిన్నారులకు సందడి. బడులకు సెలవులు ఇవ్వడంతో కొందరు అమ్మమ్మ, తాతమ్మల ఊళ్లకు వెళుతుంటారు. మరి కొందరు విహార యాత్రలకు వెళుతుంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆట విడుపునకు అనువుగా ఉంటే ప్రదేశాలకు తీసుకువెళ్తుంటారు. ఈ వేసవిలో ఎండలు మండుతున్నాయి. కాకినాడ సాగర తీరంలో సూర్యారావుపేట వద్ద బీచ్‌కు వచ్చే వారు పక్కనే ఉన్న శిల్పారామాన్ని ఒక లుక్ వేయవల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం శిల్పారామాలను పలు సందర్శనీయ ప్రాంతాలలో అభివృద్ధి చేసింది. కాకినాడ జిల్లాలో వాకలపూడి గ్రామ పరిధిలో బీచ్‌ను ఆనుకుని ఉన్న శిల్పారామం పచ్చని చెట్లు, పచ్చికతో కూడిన ఆహ్లాకరమైన వాతావరణంలో శిల్పకళలకు నెలవుగా చిన్నారులకు ఆట విడుపుగా తీర్చిదిద్దారు. సుమారు 14.82 ఎకరాలలో రూ.3 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని 2018 డిసెంబరు 12న అందుబాటులోకి వచ్చింది. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబేలా కళాత్మకంగా తీర్చిదిద్దిన ప్రవేశ ద్వారం నుంచి లోపల శిలలపై అందమైన కళాకృతులు, చిన్నారులకు ఆట విడుపు కోసం ప్రత్యేక పార్కు, కళాకారుల ప్రదర్శనలకు కళా వేదిక, పండగ వేళల్లో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేలా విశాలమైన స్థలం, ఫొటో షూట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు, మినీ ఫంక్షన్లు, జన్మదిన వేడుకలు చేసుకునేందుకు మినీ డార్మెటరీ తదితర వాటిని అందుబాటులో ఉంచారు. ఏటా సంక్రాంతి పండగ రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించేందుకు శిల్పారామం ముందు వరసలో ఉంటుంది. ప్రస్తుత సమ్మర్‌లో తమ పిల్లలకు ఆట విడుపు కోసం కాకినాడ బీచ్‌లో శిల్పారామం చక్కని వేదికగా ఉంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో శిల్పారామం నిర్వహిస్తుండగా మరిన్ని సౌకర్యాల కల్పన కోసం ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా సుమారు రూ.కోటి నిధులతో వాటర్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వాటర్ పార్కు అందుబాటులోకి వస్తే జలకాలాటలతో కాలక్షేమం చేసేందుకు శిల్పారామం వేదిక కానుంది.

సందర్శకులకు మెరుగ్గా సౌకర్యాలు



శిల్పారామానికి వచ్చే సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. సెలవు రోజులు, పండగల్లో ఎక్కువగా పిల్లలతో తల్లిదండ్రులు వస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఉదయం నుంచి సందడి నెలకొంటోంది. వాటర్ పార్కుతో పాటు మరి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నాం.

– ప్రకాష్, పరిపాలనాధికారి, శిల్పారామం, కాకినాడ



చురుగ్గా సాగుతున్న వాటర్ పార్కు నిర్మాణ పనులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ సిటీ: నగరంలో చెట్ల కొమ్మల నరికివేత సందర్భంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగింపునకు జగన్నాథపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ గురువారం తెలిపారు. జగన్నాథపురం పరిధిలోని ఏటిమొగ కెనాల్ రోడ్, గోళీలపేట, వలందపేట, చర్చి స్క్వేర్, పురం వారి వీధి, నరసింహరోడ్డు, శివాలయంవీధి, తారకరామనగర్, ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్, సుందర్‌నగర్, పప్పులమిల్ ఏరియా, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావు నగర్, సత్యదేవి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ప్రసాద్ తెలిపారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపు విధానాన్ని పునఃసమీక్షించాలి

బోట్‌క్లబ్: విద్యుత్ అధికారులు కరెంటు బిల్లులు ఇవ్వకుండా సెల్‌ఫోన్ మెస్సేజ్‌లు పంపడంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని వల్ల సాంకేతిక పరిజ్ఞానం లేని అపరాధ రుసుములు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత నెలలో ప్రవేశ పెట్టిన ఆన్‌లైన్ బిల్లుల పంపిణీ విషయం తెలియని కారణంగా అనేక మంది ఈ నెల విద్యుత్ బిల్లుతో ప్రైవేటు కౌంటర్‌లో అదనపు కమీషన్ ఇచ్చి అత్యవసరంగా పెనాల్టీ చెల్లించాల్సి వచ్చిందన్నారు. వేసవి సెలవుల వల్ల వివిధ క్షేత్రాలకు, ఊళ్లకు వెళ్లిన మరి కొందరి విద్యుత్ కట్ అవుట్ల వద్ద ఫ్యూజులు తొలగించడం వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

వైభవంగా భావనారాయణుని శ్రీచక్ర స్నానం



శ్రీచక్ర స్నానం చేయిస్తున్న అర్చకులు



శ్రీచక్ర స్నానం కోసం వేచి ఉన్న భక్తులు



పల్లకిలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణుని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

- భక్తజన సంద్రమైన సాగరతీరం
- ఘనంగా స్వామి అమ్మవార్ల ఊరేగింపు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం వేలాది మంది భక్తుల నడుమ సాగర తీరాన స్వామి వారికి శ్రీచక్ర స్నానం వైభవంగా నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణ, పూర్ణాహుతి నిర్వహించి, అనంతరం శేష వాహనంపై స్వామి వారిని ఊరేగింపుగా సర్పవరం నుంచి సూర్యారావుపేటకు తీసుకువెళ్లారు. సూర్యారావుపేట ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌లో అర్చకులు కిరణ్, ప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం సముద్రపు ఒడ్డున సముద్ర జలాలతో స్వామి వారికి శ్రీచక్ర స్నానం చేయించగా భక్తులు స్వామి వారిని దర్శించి ఆ జలాలతో స్నానమాచరించారు. కార్యక్రమంలో ఈవో భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

- ఏడీసీ నాగ నరసింహారావు
- పారిశుధ్య పనుల తనిఖీ



పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్‌తో కలిసి నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ జె.నివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు ఆదేశాల మేరకు ఇప్పటికే పూడికతీత పనులను వేగవంతం చేశామన్నారు. వర్షాలు పడే లోపుగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. డీ-సిల్టేషన్ పనులను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కొన్ని ప్రాంతాలలో చెత్తను హూపర్ టిప్పర్ వాహనాలకు ఇవ్వకుండా రోడ్ల పైన డ్రైనేజీలలోను వేస్తున్నారని ఈ విధానాన్ని మానుకోవాలని ఆయన సూచించారు. అటువంటి వ్యాపారులు, గృహ యజమానులకు గతంలో జరిమానాలు విధించామని, ఇలాగే కొనసాగితే మళ్లీ జరిమానాలు వేస్తామన్నారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమని ఆయన స్పష్టం చేశారు. నరసింహారావు వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మ తదితరులు ఉన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్



జేఎన్టీయూకేలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జేఎన్టీయూలో భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను గురువారం రాత్రి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ, పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం కాకినాడ పట్టణం, తుని, నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిమిత్తం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

కమిషనర్ వెంకటరావు



కాకినాడ ఏడీబీ రోడ్డులో నిర్వహిస్తున్న పైప్‌లైన్ మరమ్మతులు

కాకినాడ సిటీ: రహదారుల మరమ్మతుల నిమిత్తం చేపట్టిన పనుల దృష్ట్యా కాకినాడ నగరంలోని కొన్ని ప్రాంతాలకు మూడు రోజుల పాటు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్టు కమిషనర్ వెంకటరావు గురువారం తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అధిక సంఖ్యలో ట్యాంకర్లను ఏర్పాటుచేసి తాగునీరు సరఫరాకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కారణంగా ఏ ప్రాంతంలోనైనా తాగునీరు అవసరమైతే మున్సిపల్ అధికారులను సంప్రదిస్తే ఆ ప్రాంతానికి ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపుతామన్నారు. ప్రజలు తాగునీటి అంతరాయానికి అధికారులతో సహకరించాలని కమిషనర్ వెంకటరావు కోరారు.

అమెరికాకు జేఎన్‌టీయూకే బృందం



డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): యూనివర్సిటీ అభివృద్ధిలో విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం కోసం జేఎన్‌టీయూకే బృందం వారం రోజుల పాటు అమెరికాలో పర్యటిస్తోందని ఉపకులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూకేకి న్యాక్-ఎ+ హోదా వచ్చిన నేపథ్యంలో పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్‌తో కూడిన ప్రతినిధి బృందం అమెరికాలో పర్యటిస్తోందని పేర్కొన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో, డల్లాస్, వాషింగ్టన్ డీసీలో నిర్వహించే సమావేశాల్లో ఈ బృందం పాల్గొంటుందన్నారు. అలాగే అమెరికా మిస్సోరీ యూనివర్సిటీ, చికాగో స్టేట్ యూనివర్సిటీ, టెక్సాస్ ఏఅండ్‌ఎం యూనివర్సిటీతో సహకార కార్యక్రమాలు, స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం, అంతర్జాతీయ గ్రాంట్ల మంజూరుకు దరఖాస్తు, పరిశోధనలపై చర్చలు ఉంటాయని వివరించారు. యూఎస్ వర్సిటీలతో భాగస్వామ్య ఎంఎస్ ప్రోగ్రాములు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మిస్సోరీ వర్సిటీతో జాయింట్ గ్రాంట్‌కు దరఖాస్తు చేస్తామని తెలిపారు. పార్టనర్‌షిప్-2020 గ్రాంట్ విజయవంతంగా అమలు చేసినందుకు అమెరికా ప్రభుత్వం నుంచి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ పొందామన్నారు. చికాగో స్టేట్ యూనివర్సిటీతో కలిసి 2015–19 మధ్య ఒబామా–సింగ్ ఇనిషియేటివ్ గ్రాంట్ విజయవంతంగా నిర్వహించామని డాక్టర్ ప్రసాదరాజు తెలిపారు.

బాలల సంక్షేమానికి ముస్కాన్

కాకినాడ రూరల్: వివిధ కారణాలతో ఇంటి నుంచి పారిపోయిన లేదా తప్పిపోయిన బాలలను ముష్కాన్ ఆపరేషన్ ద్వారా వారి తల్లిదండ్రులు చెంతకు చేర్చడం గానీ, పునరావాస కేంద్రాలకు తరలించడం గానీ జరుగుతుందని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పేదరికం, చదవడం ఇష్టం లేకపోవడం, సవితి తల్లి పోరు తదితర కారణాలతో చాలామంది పిల్లలు ఇంటి నుంచి పారిపోతున్నారన్నారు. అటువంటి వారిని మాఫియా టార్గెట్ చేసి శిక్షణ ఇచ్చి నేరస్తులుగా మార్చి సమాజంపై వదులుతున్న ఘటనలు చాలా ఉన్నాయన్నారు. దీని నివారణకు పోలీసు శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ తదితర ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ సంస్థల వద్ద వీధి బాలలను కార్మికులుగా గుర్తిస్తామన్నారు. ఎవరికైనా భిక్షటన చేస్తున్న పిల్లలు, తప్పిపోయిన పిల్లలు తారసపడితే 100, 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని వెంకట్రావు కోరారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికీ.. కల్పనకూ.. అడుగేద్దాం..

- పీఆర్ ఒకేషనల్ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎనిమిది బ్రాంచ్‌లు, 320 సీట్లు



సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు వేళయ్యింది. పదో తరగతి పూర్తయిన ప్రతి విద్యార్థికీ కళాశాల చదువులు చదవాలన్నది ఒక కల. ఎవరి లక్ష్యానికి అనుగుణంగా వారు భవితకు నిచ్చెనలు వేసుకుంటారు. ఒకప్పుడు ఇంటర్మీడియెట్ అంటే గుర్తొచ్చే గ్రూపులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ. కానీ నేడు ప్రభుత్వ కళాశాలల్లో ఆ కోర్సులతో పాటు వృత్తి విద్యలో సైతం వైవిధ్యమైన కోర్సులకు స్వాగతం పలుకుతున్నాయి. రాష్ట్రంలో ప్రత్యేకంగా 8 వృత్తి విద్యా కళాశాలలు ఉండగా అందులో ఒకటి ప్రత్యేకంగా కాకినాడలో నెలకొల్పారు. వీటిలో 320 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు, ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయి. దరఖాస్తు సమయంలోనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సహకారంతో వివిధ సంస్థలకు అప్రెంటిస్‌కు పంపుతున్నారు. అనంతరం వారికి కొన్ని సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సులు నాలుగు ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ అండ్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయి. వీటిని పూర్తి చేసుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు, ప్రైవేటు సంస్థలలోనూ మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. వీటితో పాటు స్వయంగా ఉపాధి ఏర్పరచుకుని మరికొందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చు. అంతే కాకుండా బ్రిడ్జి కోర్సు పాసై పైచదువులు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, డిగ్రీలలో చేరి ఉన్నత చదువులు చదవవచ్చు. పారా మెడికల్ కోర్సులలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సు అనంతరం ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో లేబొరేటరీల్లో ల్యాబ్ టెక్నీషియన్‌గా, ఏఎన్ఎంలుగా ఉపాధి అవకాశాలు పొందవచ్చు. బిజినెస్ కామర్స్ కోర్సుల విభాగంలో అకౌంటింగ్ అండ్ టాక్సేషన్, ఆఫీస్ అసిస్టెన్స్, గార్మెంట్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇవి పూర్తి చేసిన వారికి అకౌంటెంట్, ఆడిట్, స్టెనోగ్రాఫర్, టైపిస్టు, క్లరికల్ మరియు గార్మెంట్ రంగాలలో ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఈ కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడ్డారని మిగిలిన వారిలో చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని స్థిరపడ్డారు.

దరఖాస్తుల ఆహ్వానం



ఎనిమిది కోర్సులు ఉన్నాయి. ప్రతి కోర్సులోను 40 సీట్ల చొప్పున ఉన్నాయి. వచ్చిన దరఖాస్తుల సంఖ్యను అనుసరించి సీట్ల కేటాయింపు ఉంటుంది. దూర ప్రాంత విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం మరియు ప్రభుత్వ వసతి సౌకర్యం ఉంది.

– మావూరి తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్, ఒకేషనల్ కళాశాల, కాకినాడ

అపర్ణాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు

గొల్లప్రోలు: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకర శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, 11 రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. సహస్ర నామ కుంకుమార్చన, అష్టోత్తర శతనామ కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.